సాక్షి రంగారెడ్డి

బుధవారం । 21 । జూన్ । 2023



ఆరోగ్యం పదిలం

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸



మన బడి'తో మహర్దశ

మన ఊరు – మన బడితో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. 8లో▸



అవి ఆధునిక దేవాలయాలు

కేసీఆర్ హయాంలో విద్యాలయాలు ఆధునిక దేవాలయాలుగా రూపాంతరం చెందాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸

టీకా.. పర్యవేక్షణ లేక..

అస్తవ్యస్తంగా వ్యాక్సినేషన్

- పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం
- తరచూ వికటించి వెలుగు చూస్తున్న మరణాలు
- మరోవైపు నమోదవుతున్న మిజిల్స్, డిఫ్తీరియా, కోరింత దగ్గు, హెపటైటిస్ కేసులు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం అస్తవ్యస్తంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం.. వెరసి చిన్నారుల ప్రాణాల మీదకు తెస్తోంది. మాతాశిశు మరణాల రేటును తగ్గించి, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఉచిత వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి బుధ, శని వారాల్లో ఆయా ప్రాంతాల్లోని ఏఎన్ఎంలు అర్హులైన చిన్నారులకు టీకాలు వేస్తుంటారు. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,73,750 మంది వరకు ఉండగా, పదేళ్లలోపు వారు ఐదు లక్షల మందికిపైగా ఉన్నట్లు అంచనా. టీకాల పంపిణీ కార్యక్రమంపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరకుండా పోతోంది. ఫలితంగా మిజిల్స్, డిఫ్తీరియా, కోరింత దగ్గు, హెపటైటిస్ వంటి కేసులు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వ్యాక్సిన్ల నిల్వ, సరఫరాలో లోపభూయిష్టమైన విధానాలతో వికటించి చిన్నారులు మృత్యువాతపడుతున్నారు. ఎనిమిది నెలల క్రితం కొత్తూరు మండలం కుమ్మరిగూడలో మూడు నెలల బాబు మృత్యువాత పడగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఓ మహిళకు ఒకే రోజు రెండు డోసుల కోవిడ్ టీ కాలు వేయడం అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది.

నిల్వ..సరఫరాలో లోపం

ప్రభుత్వం సరఫరా చేసిన వ్యాక్సిన్లు తొలుత సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు చేరుకుంటాయి. అటు నుంచి యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు సరఫరా అవుతాయి. వార్డు, గ్రామ పరిధిలోని పిల్లల సంఖ్య ప్రకారం ఆయా ప్రాంతాల్లోని ఏఎన్ఎంలకు అదే రోజు ఉదయం వ్యాక్సిన్ క్యారియర్లు అందజేస్తారు. వీటిని ఉదయం పది గంటలకే ఎంపిక చేసిన ఆస్పత్రి/అంగన్‌వాడీ, వార్డు ఆఫీసులకు తీసుకెళ్లి.. మధ్యాహ్నంలోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉన్నా.. పలువురు ఏఎన్ఎంలు ఉదయం 11 గంటల తర్వాతే ఆయా కేంద్రాలకు చేరుకుంటున్నారు. గంటల తరబడి వ్యాక్సిన్ క్యారియర్ మూతలను తెరిచి ఉంచుతుండటంతో పగటి ఉష్ణోగ్రతలకు ఐస్ కరిగి వాయిల్స్‌లోని వ్యాక్సిన్ పాడవుతోంది. ఒక్కో వాయిల్‌లో పది మంది పిల్లలకు సరిపడా వ్యాక్సిన్ ఉంటుంది. ఆ నిష్పత్తి మేరకు పిల్లలు వచ్చిన తర్వాతే వాయిల్స్ ఓపెన్ చేయాల్సి ఉంది. నిర్లక్ష్యానికి తోడు అవగాహన లోపంతో రోజంతా వాయిల్స్ బయటి వాతావరణంలోనే పెడుతున్నారు. అప్పటికే వ్యాక్సిన్ పాడై పిల్లల మృత్యువాతకు కారణమవుతోంది. కొంత మంది ఏఎన్ఎంలు ఒకవైపు ఫోన్లు మాట్లాడుతూ.. మరోవైపు పిల్లలకు ఇంజక్షన్లు ఇస్తున్నారు. మోతాదుకు మించి వ్యాక్సిన్లు ఇవ్వడం, ఒక వ్యాక్సిన్‌కు బదులు మరో వ్యాక్సిన్ ఇస్తుండటం, నీడిల్స్ శరీరంలో విరిగి పోవడంతో పిల్లలు చనిపోతున్నారు.

ఫీల్డ్ విజిట్‌కు వెళ్లని సూపర్‌వైజర్లు

గర్భిణులకు మూడు డోసుల టీటీ సహా బూస్టర్ ఇంజక్షన్లు ఇస్తుండగా, అప్పుడే పుట్టిన బిడ్డకు హెపటైటిస్ బి, బీసీజీ, పోలియో, విటమిన్ కె వ్యాక్సిన్లు వేస్తుంటారు. ఆ తర్వాత 45 రోజులకు, 75 రోజులకు, 105 రోజులకు పెంటా, ఐపీవీ, ఆర్‌వీవీ, పీసీవీ, పోలియో, ఓపీవీ వ్యాక్సిన్ డోసులు ఇస్తారు. పదో నెలలో ఎంఆర్ ఫస్ట్ డోసు, విటమిన్ ఎ సహా 18వ నెలలో ఎంఆర్ రెండో డోసు, డీపీటీ, ఓపీవీ, విటమిన్ ఎ రెండో డోసు ఇస్తారు. ఆ తర్వాత ఐదేళ్ల వరకు ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్ ఏ ద్రావణం తాగించాల్సి ఉంది. ఆరు, పది, పదహారేళ్ల వయసులో డీటీ ఇంజక్షన్ ఇస్తుంటారు. వ్యాక్సినేషన్‌లో పాల్గొంటున్న కొంత మంది సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు పిల్లలకు టీకాలు వేయకుండానే వేసినట్లు లెక్కలు చూపిస్తున్నారు. మరి కొంతమందైతే ఏకంగా వాటిని చెత్తకుప్పల్లోనూ, మురుగునీటి కాల్వల్లోనూ పడేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. నిజానికి 2023 నాటికి మిజిల్స్‌ను పూర్తిగా రూపుమాపాలని లక్ష్యంగా నిర్ణయించింది. సిబ్బంది నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బాలాపూర్, జల్‌పల్లి, పహాడిషరీఫ్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, నందనవనం తదితర ప్రాంతాల్లో ఎంఆర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండడం గమనార్హం.

వ్యాక్సిన్‌తోనే బాలుడి మృతి..

కొత్తూరు పీహెచ్‌సీలో గత నవంబర్‌లో కుమ్మరిగూడకు చెందిన మూడేళ్ల బాలునికి పెంటావాలెంట్ (ఇంజక్షన్) సహా రోటా, ఓపీడీ (ఓరల్ వ్యాక్సిన్)లను ఇచ్చారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు అప్పట్లో ఈ ఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. వ్యాక్సిన్ వేసిన ఏఎన్ఎంను వైద్య ఆరోగ్యశాఖ అక్కడి నుంచి మరో చోటికి బదిలీ చేసింది. ఇటీవల మృతి చెందిన బాలుని పోస్టుమార్టం రిపోర్టు పోలీసులకు అందింది. బాలుని మృతికి వ్యాక్సినే కారణమని వెల్లడైంది. ఈ విషయంలో ఎవరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలో అర్థం కాక పోలీసులు తలపట్టుకోవాల్సి వస్తోంది. చివరికి వ్యాకిసన్ వేసిన ఏఎన్ఎంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చూసి విమర్శలు రావడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది.



తరగతి గదిలో ఓ విద్యార్థినితో పాఠం చదివిస్తున్న మంత్రి సబితారెడ్డి

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట్: కార్పొరేట్ కన్న ప్రభుత్వ బడులు బాగున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి, మన బస్తీలో భాగంగా సకల హంగులతో 12 రకాల సౌకర్యాలతో రాష్ట్రవ్యాప్తంగా తీర్చిదిద్దిన 1000 ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించామన్నారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, టెక్స్ట్, నోట్ పుస్తకాలు, రాగి జావ, ఉపాధ్యాయులకు ట్యాబులు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు రూ.136 కోట్లతో రెండు జతల యూనిఫామ్స్, రూ.190 కోట్లతో ఉచితంగా టెక్స్ట్ బుక్స్, సంవత్సరానికి రూ.35 కోట్ల ఖర్చుతో రాగి జావ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. రూ.12 లక్షల మంది విద్యార్థులకు రూ.56 కోట్ల విలువగల నోట్ బుక్స్, 34.25 కోట్ల విలువ చేసే 20 వేల మంది ఉపాధ్యాయులకు ట్యాబ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున విద్యా రంగానికి నిధులు కేటాయిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో రూ.6 కోట్లతో టెక్స్ట్ బుక్స్ రూ.10 కోట్ల 50 లక్షలతో 1.65 లక్షల మంది రెండు జతల యూనిఫామ్స్‌లు రూ. 5 కోట్ల విలువ చేసే 72 వేల మంది విద్యార్థులకు నోట్ బుక్స్, రూ.18.15 లక్షలతో రాగి జావ, రూ.1.6 కోట్ల విలువ చేసే 1058 ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల కాలంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా తయారు కావాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను మంత్రి ఘనంగా సన్మానించి, రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌర పఠన కేంద్రం ప్రారంభం

రాష్ట్రవ్యాప్తంగా 5 వేల పౌర పఠన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సబితారెడ్డి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని శ్రీలలితా నగర్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయ సేవలను విస్తతం చేయాలనే లక్ష్యంతో పౌర పఠన కేంద్రాల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, పౌర గ్రంథాలయాల డైరెక్టర్ శ్రీనివాస చారి, ఉప సంచాలకులు శ్రీహరి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మాధవి, గ్రంథపాలకులు సత్యనారాయణ, జైహింద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు కొండకల్‌కు సీఎం కేసీఆర్ రాక!

శంకర్‌పల్లి: కొండకల్‌లోని రైల్, మెట్రోకోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 22న రానున్నట్టు సమాచారం. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో 200 పడకల మల్టీ స్పెషాలటీ ఆస్పత్రికి ఉదయం 11గంటలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రామచంద్రాపురం మండలం కొల్లూరు, వెలిమెల గ్రామాల్లో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి మండలంలోని కొండకల్ గ్రామానికి విచ్చేయనున్నారు. ఏ సమయానికి వస్తారనేది ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. ముఖ్యమంత్రి జిల్లాకు వస్తుండటంతో అధికారులు, పోలీసులు అలర్ట్ అయ్యారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. 2018లో కొండకల్ గ్రామంలోని సర్వే నంబర్ 310లో గల 100 ఎకరాల్లో రూ. 800కోట్ల నిధులతో రైల్, మెట్రో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి కేసీఆర్ రాక నేపథ్యంలో పోలీస్ బందోబస్తు నిమిత్తం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం కొండకల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని పరిశీలించారు.

నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు



పరిశ్రమలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న సుజాత

నందిగామ: ప్రభుత్వ నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తప్పవని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆఫీసర్ సుజాత హెచ్చరించారు. నందిగామలోని వీకాయ్ ప్లాస్ట్ పరిశ్రమను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశ్రమను సందర్శించినట్లు చెప్పారు. ప్రతి పరిశ్రమలో సేఫ్టీ పరికరాలు ఉండాలన్నారు. పరిశ్రమ గేటు బయట బోర్డు ఉంచాలని సూచించారు.

బాలాపూర్ పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ



మీర్‌పేట్: బాలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావు మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత, ప్రోగ్రాం అధికారి అనిత, డాక్టర్ బాలమణి, సీహెచ్ఓ నర్సింగ్ రావు, పీహెచ్ఎన్ రేణుక, హెల్త్ ఎడ్యుకేటర్ ముని, సురేష్, కమల కుమారి, శ్రీనివాస్, పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిక్ మై ప్లాస్టిక్'తో వ్యర్థాల నిర్మూలన

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన డెయిరీ బ్రాండ్.. సిద్స్ ఫార్మ్ 'పిక్ మై ప్లాస్టిక్' పేరిట సరికొత్తగా పర్యావరణహిత కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. ఇందులో భాగంగా వినియోగదారుల ఇళ్ల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, రీసైక్లింగ్ చేయనుంది. పాలు, పెరుగు, నెయ్యి, లస్సీ, మజ్జిగ తదితర ఉత్పత్తులకు సంబంధించిన ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి, కార్బన్–న్యూట్రల్ దిశగా కృషి చేసేందుకు ఈ పిక్ మై ప్లాస్టిక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు వ్యవస్థాపకుడు డాక్టర్ కిషోర్ వెల్లడించారు.

ప్లేస్కూల్‌లో మంటలు

- తరగతి గదుల్లో చిన్నారులు లేకపోవటంతో తప్పిన ముప్పు

మణికొండ: విద్యుత్ హెచ్చు తగ్గులుగా సరఫరా కావటంతో ఓ ప్లేస్కూల్ ఏసీల్లో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ సెక్రటేరియట్ కాలనీలో శ్రీగాయత్రి టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో జాలీ కిడ్స్ ప్లే స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మొదటి అంతస్తులోని రెండు ఏసీల నుంచి మంటలు వచ్చాయి. దట్టమైన పొగ తరగతి గదుల నిండా వ్యాపించింది. ఆ సమయంలో విద్యార్థులు సెల్లార్‌లో ఆడుకుంటున్నారు. గమనించిన ఉపాధ్యాయులు మున్సిపాలిటీ వారికి విషయం చెప్పటంతో వెంటనే అక్కడకు డిజాస్టర్ సిబ్బంది చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం తరగతి గదుల్లో వస్తున్న మంటలను ఆర్పివేశారు. విద్యుత్ సరఫరా, వైరింగ్ సమస్యతోనే మంటలు వచ్చాయని మున్సిపల్ సిబ్బంది చెప్పారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట

రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్: నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజావరప్రసాద్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యారంగం వినూత్న పంథాలో పురోగమిస్తోందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను బోధించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. మన ఊరి మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనాన్ని అందజేస్తోందని, ఇందుకు గాను కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఆయన వివరించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు వేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

ఎల్లమ్మ కల్యాణం.. ఎల్లెడలా భక్తిభావం

భక్తజన తరంగం మధ్య మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 11.55 గంటల సమయంలో అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పుస్తె, మెట్టెలు, తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



హాజరైన మంత్రి తలసాని, భక్తులు

నిత్య సాధనతో ఆరోగ్య'యోగ'ం

- ధ్యానంతో మానసిక ప్రశాంతత
- రుగ్మతలు మటుమాయం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

షాద్‌నగర్: శ్వాసపై అదుపు కోల్పోతే వ్యాధుల బారిన పడతాం.. యోగా ద్వార మనస్సును, శరీరాన్ని సంపూర్ణంగా అదుపులో ఉంచుకోవచ్చు. యోగ ధ్యానంతో నిద్రానంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీయొచ్చు. ఆత్మవిశ్వాసం లోపించిన వారిలో మనోస్థైర్యాన్ని నింపొచ్చు. నేటి హైటెక్ యుగంలో అత్యాధునిక పరిజ్ఞానంతో తయారైన మందులు సైతం కొన్ని రుగ్మతలను నయం చేయలేకపోతున్నాయి. అలాంటివాటిని నయం చేయగల శక్తి యోగాకు ఉంది. యోగా చేయడం ద్వారా ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండడమే కాకుండా మనోధైర్యాన్ని పెంపొందించుకోవచ్చు. యోగా చేయడం ద్వారా ఆనందంగా ఉండొచ్చు. నేడు ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం ..

సర్వరోగ నివారిణి

యోగా సాధన చేయడం ద్వారా మనిషిలో ఉన్న సర్వరోగాలు మటుమాయం అవుతాయి. శరీరానికి సరిపడా యోగా చేస్తే కండరాలకు కావాల్సిన శక్తి రావడంతో పాటు ధృడంగా మారుతాయి. ధ్యానంతో ఒత్తిడిని అధిగమించొచ్చు. శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. అలసటను తగ్గించడంతో పాటు ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. ఫలితంగా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శారీరక, మానసిక ప్రశాంతత, మనోబలం, సంగ్రహణ శక్తిని పెంపొందిస్తుంది.

యోగాసనాల్లో అనేక రకాలు

యోగాసనాల్లో చాలా రకాలు ఉన్నాయి. నిలబడి, కూర్చొని, పడుకొని చేసే ఆసనాలు ఉన్నాయి. వజ్రాసనం, అర్ధ ఉష్ట్రాసనం, శశాంకాసనం, ఉత్తానమండూకాసం, వక్రాసనం, మకరాసనం, తడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం, అర్ధచక్రసనం, త్రికోణాసనం, భద్రాసనం, సరళభుజంగాసనం, పవన యుక్తాసనం, శలభాసనం, సేతు బంధాసనం, ఉత్తానపాదాసనం, అర్ధహలాసనం, పవన ముక్తాసనం, శవాసనం ఇలా అనేక రకాలు ఉన్నాయి. ప్రాణాయామాలు కపాలభాతి, అనులోమ విలోమ, శీతలీ ప్రాణాయామం, భ్రమరీ ప్రాణాయామం, ధ్యానం ఉన్నాయి.

విస్తరిస్తున్న యోగా

యోగా క్రమక్రమంగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. చాలా మంది యోగా, ఆసనాలు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయిస్తున్నారు. తెల్లవారు జాము మొదలుకొని ఉదయం సూర్యకిరణాలు వచ్చేంత వరకు యోగాను సాధన చేస్తున్నారు. వృద్ధాశ్రమాల్లో యోగా శిక్షణా తరగతులను పతంజలి యోగా సమితి వారు నిర్వహిస్తున్నారు. ఆశ్రమాల్లో చాలా మంది వయస్సు పై బడిన వారు ఉండటంతో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన సమస్యతో బాధపడుతుంటారు. సమస్యను దూరం చేసుకునేందుకు యోగా సాధన చేస్తున్నారు.



యోగా సాధన

యోగాతో ఆరోగ్యం



ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలి. నిత్యం యోగా చేయడం ద్వారా ఆర్యోగంగా ఉంటారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం ఉల్లాసంగా ఉంటుంది.

– ఎం.లింగమయ్య, యోగా శిక్షకుడు, భారతస్వాభిమాన్ అధ్యక్షుడు, షాద్‌నగర్

రోగాలు మాయం



నిత్య యోగా సాధనతో రోగాలు మటుమాయం అవుతాయి. మానసిక, శారీరక ఒత్తిళ్లను అధిగమించొచ్చు. శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ చక్కగా జరుగుతుంది. అలసటను పూర్తిగా తగ్గిస్తుంది.

– పానుగంటి శేఖర్, పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు, షాద్‌నగర్

రేపు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్: తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నెక్లెస్ రోడ్డు రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి జంక్షన్ల మధ్య ట్రాఫిక్‌కు అనుమతి లేదు. పంజగుట్ట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనాలను నెక్లెస్ రోడ్డు రోటరీ వైపు వెళ్లేందుకు అనుమతించరు. ఈ వాహనాలను షాదాన్ కళాశాల నుంచి నిరంకారి వైపు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి వచ్చే వాహనాలకు రోటరీ చౌరస్తా వైపునకు అనుమతి ఉండదు. బుద్ధ భవన్ నుంచి వచ్చే ట్రాఫిక్ నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌వైపు వెళ్లడానికి నల్లకుంట చౌరస్తా నుంచి మళ్లిస్తారు. లిబర్టీ, అంబేడ్కర్ విగ్రహం నుంచి వచ్చే ట్రాఫిక్ ఎన్టీఆర్ మార్గ్ వైపునకు వెళ్లడానికి అనుమతి లేదు. రాణీగంజ్, కవాడిగూడల నుంచి వచ్చే వాహనాలను ట్యాంక్‌బండ్ వైపు అనుమతించరు. బడా గణేష్ నుంచి ఐమాక్స్, నెక్లెస్ రోటరీ వైపు, మింట్ లేన్ వైపు వచ్చే ట్రాఫిక్ బడా గణేష్ వద్ద నుంచి రాజ్‌దూత్ లేన్ వైపు మళ్లింపు ఉంటుంది. తెలంగాణ అమరవీరుల స్మారక ప్రారంభోత్సవం దృష్ట్యా 22న ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, లుంబినీపార్క్ మూసి ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి ఎగువట్యాంక్‌బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌కు అనుమతి లేదు. వాహనదారులు,ప్రజలు ట్రాఫిక్ డైవర్షన్లను గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సుధీర్‌బాబు సూచించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



షాద్‌నగర్: పూరీ జగన్నాథ స్వామి రథయాత్రను మంగళవారం షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కొలువుదీరిన జగన్నాథ స్వామి ఆలయం నుంచి రథయాత్రను ప్రారంభించారు. మెయిన్ రోడ్డు మీదుగా ఫరూఖ్‌నగర్ వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులు విశ్వం, సాయికృష్ణ, భిక్షపతి, సుధీర్, వెంకట్‌రామ్‌రెడ్డి, రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల ర్యాలీలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల: సీఎం కేసీఆర్ హయాంలో విద్యాలయాలు ఆధునిక దేవాలయాలుగా రూపాంతరం చెందాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని స్థానిక వీరయ్య ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్రం రాక ముందు సర్కారు బడులు పశువుల పాకలుగా ఉండేవని, నేడు ఆధునిక దేవాలయాలుగా విరాజిల్లుతున్నాయని అన్నారు. గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. విదేశీ విద్యకు రూ. 20లక్షల సాయం, జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల గ్రంథాలయాలు, 1,600ల డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ బి.శైలజ, ఎంఈఓ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మా పాలనలోనే జీపీలకు సొంత భవనాలు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- కప్పపహాడ్‌లో పంచాయతీ నూతన భవనం ప్రారంభం



కప్పపహాడ్‌లో పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పాలనలోనే గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు సమకూరాయని, ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని, అలాగే రూ. 11లక్షల నిధులతో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తండాలను పంచాయతీ హోదా ఇచ్చి అభివృద్ధికి బాటలు వేసినట్లు తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల రూపురేఖలు మారాయని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ హంసమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ఎంపీటీసీలు మంగ, నాగమణి, ఉప సర్పంచ్ మునీర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జలేందర్, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

స్టేట్ స్పోర్ట్స్, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య



విద్యార్థినులతో ఆసనాలు వేయిస్తున్న చెన్నయ్య

షాద్‌నగర్ రూరల్: యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్టేట్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం షాద్‌నగర్ నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. యోగా సాధనతో శరీరం ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే భారీ ప్రాజెక్టులు

- ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్ట్, ఫ్యాబ్‌సిటీ, హార్డ్‌వేర్ పార్కులు
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ హయాంలోనే ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్ట్, ఫ్యాబ్‌సిటీ, హార్డ్‌వేర్ పార్కులు వంటి భారీ ప్రాజెక్టులు వచ్చాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. దీంతో ఇక్కడి భూములకు మంచి ధరలు వచ్చాయన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే ఎయిర్‌పోర్ట్, ఫ్యాబ్‌సిటీ, హార్డ్‌వేర్ పార్క్, ఔటర్ రింగ్ రోడ్డు వంటివి వచ్చాయన్నారు. సీఎం కేసీఆర్ మాత్రం ఈ ప్రాంతానికి ప్రమాదకర ఫార్మాసిటీ పరిశ్రమలకు అనుమతులిచ్చారని ఆరోపించారు. మీర్‌ఖాన్‌పేట్, అన్నోజీగూడ, సార్లరావుల పల్లి, బేగరి కంచె, ముచ్చర్ల, కందుకూర్, మహేశ్వరం మండలంలోని చాలా ప్రాంతాలను బఫర్ జోన్‌గా ప్రకటించి ఇక్కడి ప్రజల బతుకులను అంధకారం చేశారన్నారు. తుమ్మలూరు సభలో సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టేందుకు ఉత్తుత్తి హామీలు ఇచ్చారని ఆరోపించారు. మాయ మాటలతో ప్రజా వ్యతిరేకతను ఆపలేరన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మంత్రి సబితారెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, వచ్చే ఎన్నికల్లో ఆమెను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్‌ని మహేశ్వరానికి పిలిపించి ఆచరణ సాధ్యం కాని హామీలను ఇప్పించారని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- గర్భిణులు, బాలింతలకు న్యూట్రిషియన్ కిట్ల పంపిణీ

నందిగామ: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నందిగామ పీహెచ్‌సీలో ఆరోగ్య లక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయనున్నట్లు వివరించారు. అనంతరం మహిళలకు న్యూట్రిషియన్ కిట్లు అందజేశారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ విద్యా దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ ప్రారంభం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన తాండ్ర గోపాల్‌రెడ్డి సొంత నిధులు రూ. లక్షతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. గోపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి సొంత ఖర్చులతో నూతనంగా ప్రతిష్ఠించిన సరస్వతి దేవి విగ్రహం, అశోక స్తూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, ఎంపీపీ ప్రియాంక, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, ఉప సర్పంచ్ కుమార్ గౌడ్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ విజయలక్ష్మి, తహసీల్దారు రహ్మాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం దినేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

సకల సదుపాయాలతో సర్కారు విద్య

షాద్‌నగర్ రూరల్: సకల సదుపాయాలతో సర్కారు విద్య అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని రాయికల్, కాశిరెడ్డిగూడ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ఇందులో భాగంగానే మన ఊరు – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా షాద్‌నగర్ నియోజకవర్గంలో 149 పాఠశాలల్లో రూ. 22.2కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

‘మన ఊరు – మన బడి’తో మహర్దశ

- నేనూ ఇక్కడే చదివా.. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామి అవ్వడం సంతోషంగా ఉంది: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- ఘనంగా విద్యా దినోత్సవం



విద్యార్థులతో కలసి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు

కడ్తాల్: మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేయడం జరిగిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలికల, బాలుర ప్రాథమికోన్నత పాఠశాలల్లో మన ఊరు – మన బడి పథకం కింద రూ.30 లక్షలతో ఆధునీకరించిన పాఠశాలను, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. డిజిటల్ తరగతులు ప్రారంభించడం తోపాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తరువాత పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. కార్పొరేట్ తరహా విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమానికి మొదటి విడత కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 7300 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో 8,500 పాఠశాలలో మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, సీఐ ఉపేందర్, ఎంఈవో సర్దార్ నాయక్, ఎంఎన్‌వో జంగయ్య, హెచ్ఎం విజయ, ఎంపీటీసీలు లచ్చిరామ్ నాయక్, గోపాల్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, గ్రామ అధ్యక్షుడు నర్సింహ, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.